మళ్ళీ వైకాపా అధికారంలోకి రావడం తథ్యం!

-నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు
-వైకాపా జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

తవణంపల్లె, డిసెంబర్ 15 ప్రభాతవార్త: రానున్న ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి రావడం తథ్యమని, నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడ కుండా ముందుకు సాగాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐరాల క్రాస్‌లోని నారాయణాద్రి కళ్యాణ మండపంలో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైకాపా కన్వీనర్ డాక్టర్ సునీల్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు అబద్ధపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ఆరునెలల కాలం లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైపల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. అలాగే స్థానికంగా నాయకులు, కార్యకర్తల సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించి పార్టీ ప్రక్షాళనకు కృషి చేస్తానని కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈసమావేశంలో మాజా ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, జడ్పీ వైస్ ఛైర్మన్ ధనుంజయరెడ్డి, తవణంపల్లె మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డితో పాటు ఐదు మండలాల కన్వీనర్‌లు, మాజీ జడ్పీ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా, నాయకులు గాంధీబాబు, గౌహతి సుబ్బారెడ్డి, బుజ్జిరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, చినకాంపల్లె చిన్నారెడ్డిలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొనా న్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మళ్ళీ సర్కార్ సొంతింటి ఆశలు!

-పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు స్థలం?

ప్రభాతవార్త-తిరుపతి:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతిల్లు లేని పేదలకు సొంతింటి ఆశలు నెరవేర్చేలా ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకుగాను అర్హులైన వారికి రేషన్‌కార్డు ,ఆధార్‌కార్డు ప్రాతిపదికన పట్టణాల్లో నివాసముంటున్న వారికి 2 సెంట్లు, గ్రామాల్లో ,మండల కేంద్రాల్లో నివాసముంటున్న వారికి 3సెంట్లు స్థలం ఇచ్చేందుకు, లబ్ధిదారులకు సొంతిల్లు నిర్మించి ఇవ్వాలని కూడా ప్రభుత్వం చర్చచేస్తున్నట్లు తెలుస్తోంది, రానున్న మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చించి తగిన వివరాలు వెల్లడించే అవకాశం ఉందని టిడిపి సీనియర్ నేతలు చెబుతున్నారు. నూతన సంవత్సరంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఇల్లు లేని నిరుపేదలకు ఈ వరం కానుందనేది పార్టీలో నేతల సమాచారం. ఇప్పటికే గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం పట్టణాలు, నగరాల్లో ,గ్రామాల్లో నివాసముంటూ సొంతిల్లు లేని ప్రజలకు ఇల్లు నిర్మించి ఇస్తామని దరఖాస్తులు స్వీకరించింది. తిరుపతిజిల్లాలో తిరుపతి నగరంకు 30,40కిలోమీటర్లు దూరంలోని పలు ప్రాంతాల్లో ఇంటిస్థలం కేటాయించింది. దానికి సంబంధించి పట్టాలు కూడా లబ్ధిదారులకు అందజేశారు. అయితే ఆ ప్రాంతాల్లో చాలావరకు లబ్ధిదారులు ఇప్పటికీ ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోగా మరికొందరు పలు కారణాలతో ఇంటిపట్టాలను రెవెన్యూ అధికారులకు వెనక్కు ఇచ్చి తమతమ పేరున ఇచ్చిన వాటిని రద్దుచేయించుకున్నారు. పట్టణాల్లో చిన్నవ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలను ఎక్కడో మారుమూల ఉన్న అటవీప్రాంతంకు తరలిస్తే బ్రతుకు కోల్పోతామని అసహనం చెందారు.ఇలా వేలసంఖ్యలో ప్రజలు తిరుపతి నగరం, పరిసరాల్లోని కాలనీల్లో ఉంటున్న వాళ్ళే గాక చిత్తూరు జిల్లాలోనూ చాలా వరకు వేలసంఖ్యలో పేదలంతా సొంతిల్లు లేక అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. గత ఎన్నికల హామీల్లో బాగంగా సొంతిల్లు లేని పేదలకు కూటమి ప్రభుత్వం సొంతింటిని నిజం చేయడానికి త్వరలోనే శుభవార్త చెబుతుందని ఆశలు చిగురిస్తున్నాయి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఈ మంచి చేయాలని అధికశాతంమంది కోరుతున్నారు.

చిత్తూరులో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- నష్టపరిహారం చెల్లించి పడగొట్టాలని అడ్డుకున్న దుకాణదారులు

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జెసిబితో పడగొట్టిన షాపులు

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో ప్రధాన రహదారుల విస్తరణ కార్యక్రమంను మున్సిపల్ కార్పొరేషన్ ఆదివారం శ్రీకారం చుట్టింది. చిత్తూరు హైరోడ్డులోని శేషాపీరాన్ మసీదు పరిసరాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపడితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని శేషాపీరాన్ మసీదు కమిటీ సభ్యులు స్పష్టం చేయడంతో ఈ మేరకు మున్సిపల్ అసిస్టెంట్ టౌన్ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు విస్తరణ పనులకు ముహూర్తం పెట్టారు. ఈ మేరకు జెసిబితో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి ఉపక్రమించడంతో రెండు దుకాణాలను పడగొట్టారు. ఈ క్రమంలో రోడ్డు విస్తరణ పనులపై హైరోడ్డు దుకాణదారులు ఆదివారం సాయంత్రం ఓ లాడ్జిలో సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లోను స్థల యాజమానులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, తాము రోడ్డు విస్తరణ పనులకు అడ్డుకామని స్పష్టం చేశారు. అయితే స్థల యాజమానులకు నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో ఇటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి అటు దుకాణదారులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అప్పటికే రెండు దుకాణాలను జెసిబి ద్వారా పడగొట్టడంతో పనులు ప్రారంభించామని ఇకపై ఆగదని సంకేతాలు ఇచ్చిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అక్కడి నుండి నిష్క్రమించారు. దుకాణదారులు, స్థల యాజమానులు ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉచితంగా వున్న స్థలంను వదులుకోవాలంటే ఎలాగని, దీనికి తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని కొద్దిసేపు రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో సోమవారం నుండి శేషాపీరాన్ మసీదు ఆవరణలో ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు మళ్ళీ చేపడుతారా! లేక మరొసారి స్థల యాజమానులతో చర్చలు నిర్వహించి వారి అంగీకారంతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతారా! అనేది తేలాల్సివుంది.

విద్యుత్ సేవల్లో జాప్యం వద్దు!

-ఏపి ఐఆర్పి ఛైర్మెన్ ఠాకూర్‌రామ్ సింగ్

ఛైర్మెన్ ఠాకూర్ రామ్‌సింగ్

తిరుపతిరూరల్, డిసెంబర్ 14 ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారులకు సకాలంలో విద్యుత్ సేవలను అందించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణామండలి (ఎపిఐఆర్పి) ఛైర్మెన్ ఠాకూర్ రామ్‌సింగ్ సూచించారు. తిరుపతి సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరములో శనివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యుత్‌శాఖ అధికారులతో ఎపిఐఆర్పి ఛైర్మెన్ సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలను అందించి, వారి మన్ననలు పొందాలని సూచించారు. అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలనే ధ్యేయంతోనే విద్యుత్ అధికారులు పని చేయాలన్నారు. సంస్థ పరిధిలో సబ్ స్టేషన్స్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణను సకాలంలో పూర్తి చేసి, కొత్త సబ్ స్టేషన్స్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్ళుపై దృష్టి సారించాలని సూచించారు.. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు వీలుగా వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, తద్వారా వినియోగదారులలో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ డిఎస్ వరకుమార్, పిహెచ్ జానకిరామ్, ఎపిఐఆర్పి ఒఎస్డీ మునిశంకరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్లు సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంటల మయంగా గ్రామీణరోడ్లు...
పట్టించుకోని అధికారులు

గుంటలుపడి అధ్వానంగా ఉన్న రోడ్డు

నాయుడుపేట, డిసెంబరు 15 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని పలుగ్రామాలకు వెళ్ళే గ్రామీణరోడ్లు గుంటలుపడి అధ్వానంగా మారుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో నాయుడుపేట నుండి పూడేరుకు వెళ్ళే రోడ్డు పుదూరు- అరవపెరిమిడి గ్రామాల మధ్యలో కిలోమీటరు మెర పెద్దపెద్ద గుంటలు ఏర్పడి రోడ్డురూపాన్ని కోల్పోయింది. అధికారపార్టీకి చెందిన పెద్ద నాయకుడు అరవపెరిమిడి గ్రామం నుండి గ్రావెల్‌ను భారీ వాహనాలతో అణునిత్యం నాయుడుపేటకు తరళించడం వల్లన రోడ్డుపై పెద్దపెద్ద గుంటలుపడి అధ్వానంగా మారుతుందని ఆగ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈరోడ్డుపై నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. గుంటలుపడిన రోడ్డుమీద ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తుందని వాహన దారులు వాపోతున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్టవేసి గుంటలుపడిన రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

నీటిలో మునిగిన పంట పొలాలు

నీటిలో మునిగిన పంట పొలాలు

వాకాడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. ఇప్పటికే రైతులు తేరుకోక ముందే మరో ఆల్పా పీడనం ఉందంటూ వార్త విని రైతులు ఆందోళన చెందుతున్నారు, ఇప్పటికే నారుమడలు వేసి నీటిలో మునిగి ఆ నీరును బయట తోలే పరిస్థితిలో ఉన్నామంటూ చిన్నకారు రైతులు ఆవేదన పడుతున్నప్పటికీ, ఈ పరిస్థితుల్లో మరో తుఫాను వస్తే అప్పులతో పాటు ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని రైతులు బాధ ఆవేదన వ్యక్తం చేశారు, మండలంలోని కొన్ని గ్రామాలలో వరద నీరు రాకుండా స్వర్ణముఖి నది రహదారులకు అడ్డుకట్లు వేయడం జరిగిందన్నారు, స్వర్ణముఖి నది దిగువ ప్రాంతంలో లోతట్లో ఉన్న పొలాలు పూర్తిస్థాయిలో మునిగిపోయాయని రైతులు బాధ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాలలో వందల ఎకరాలు నీ టిలో పంట పొలాల మునిగిపోయాయని తెలిసిందే. పేద బడుగు బలహీన వర్గాలు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

స్నేహితులతో ఈతకు వెళ్ళి...గల్లంతైన విద్యార్థి

నీటిలో కొట్టుపోయి లక్ష్మీధర్-గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలోని గుండేలిగుంట పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన సురేష్‌ల చిన్న కుమారుడు లక్ష్మిధర్(14) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువు తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన స్నేహితులు నలుగురితో కలసి సమీపంలోని చోడవరం గ్రామం సమీపంలో ఉన్న వంకలో ఈతకు దిగారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం ప్రవాహం ఉండడంతో లక్ష్మిధర్ కొట్టుకు పోయాడు. మిగిలిన స్నేహితులు ఈత రావడంతో ఒడ్డుకు చేరుకుని లక్ష్మిధర్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో సమాచారం అందుకున్న వారు అక్కడకి చేరుకోవడంతో అప్పటికే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. దీంతో సమాచారం అందుకున్న ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ మధుసూధన్, తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య, అగ్నిమాపక సిబ్బంది ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో చీకటిపడడంతో వెనుదిరిగారు. ఈసందర్భంగా ఆర్డీవోభాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలకు చెరువులన్నీ నిండాయని తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను అప్రమత్తంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. చెరువుల వద్ద, తెలుగుగంగ కాలువ గట్టుల వద్ద మహిళలు ఎవరైనా దుస్తులు ఉతకరాదని హితవుపలికారు. తమ కన్న కొడుకు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడని తెలియడంతో తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రతి చెరువు వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో సూచించారు. మరోరెండు రోజుల్లో ఇంకో అల్పపీడనం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో చెరువుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చెరువులు, నదుల వద్ద జాగ్రత్తగా ఉండాలని ఆర్డీవో తెలిపారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు వలన...చెరువులుగా మారుతున్న పంట పొలాలు

చెరువును తలపిస్తున్న పంట పొలాలు

విజయపురం, డిసెంబరు 15 ప్రభాతవార్త: చిత్తూరు-తచ్చూరు హైవే రోడ్డు నిర్మాణం వలన మండలంలో కొన్ని ఎకరాల పంట పొలాలు చెరువులను తలపిస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే రోడ్డు నిర్మాణం ప్రారంభం అయిన తరువాత మధ్యలో రోడ్డు అడ్డురావడంతో వర్షపునీరు, వరద ఉధృతి నీరు పంట పొలాల్లోనే నిలిచిపోవడం వలన రైతులు ఏమి చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. వర్షం తగ్గి నాలుగు రోజులు అవుతున్నా ఇంత వరకు పంట పొలాల్లో నీరు తగ్గడం లేదని, మోటారు షెడ్డు సైతం నీటిలో ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లకండ్రిగ నుంచి సామిరెడ్డి కండ్రిగ వరకు లో తట్టు ప్రాంతాల్లో వర్షపునీరు వెళ్ళడానికి వంతెనలు సక్రమంగా నిర్మాణం జరగకపోవడం వలనే సమస్యలు ఎదురవుతున్నదని కంట తడి పెడుతున్నారు. ప్రతి ఏడాది ఇలానే పంటలు నీట మునిగితే మేము ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామిరెడ్డి కండ్రిగ వద్ద వర్షం పడిన ప్రతి సారి రోడ్డు దాటడానికి కూడా వీలు కావడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి పంట పొలాలు మునిగే ప్రదేశాల్లో వంతెన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

30శాతం మధ్యంతర భృతి ఐఆర్ ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిజిల్లా అధ్యక్షుడు

తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : 30శాతం మధ్యంతర భృతి, ఐఆర్‌ను ప్రకటించాలని తిరుపతి ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్‌ల సమస్యలను తొలగించాలని ఉపాధ్యాయులు బోధనకే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షకు సెలవు దినాల్లో విద్యాభ్యాసనం కొనసాగించడం వల్ల విద్యార్థి మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారు ఎస్.వెంకట ముని, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు కె.వెంకటాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు మదన్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్ రామ సుబ్బయ్య, సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర మాజీ ఆడిట్ కమిటీ సభ్యులు జి.సుధాకర్, జిల్లా సబ్‌కమిటీ సభ్యులు హేమకుమార్, సురేష్‌బాబు, గిరిప్రసాద్, దాము, మునస్వామి, రామదాసు, గుణశేఖర్‌లు పాల్గొన్నారు.

ఎస్.వి.వైద్య కళాశాలలో నిరంతర వైద్య విద్య

తిరుపతి హెల్త్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : ఎస్.వి. వైద్య కళాశాల, తిరుపతి రుయా ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో ప్రాంతీయ నిరంతర వైద్య విద్య కార్యక్రమం ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏ.చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇందులో ఎస్‌వి వైద్య కళాశాల తిరుపతి, పిఇఎస్ కుప్పం,అపోలో వైద్య కళాశాల చిత్తూరు, జి.ఎం.హెచ్. కడప, శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాంతీయ నిరంతర వైద్య విద్య కార్యక్రమంకి ప్రత్యేకంగా రోగులకు వైద్యం అందించడంలో నూతన విధానాలు, అత్యవసర సమయాలలో న్యూ అప్డేట్స్ ఇన్ క్రిటికల్ ఇల్నెసెస్ అనే అంశములపైన చర్చ సమావేశం నిర్వహించారు. వైద్య విద్య కార్యక్రమము నేషనల్ మెడికల్ కౌన్సిల్ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వారి ఆదేశాల మేరకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించు కుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ(డి ఎం క్రిటికల్ కేర్), డాక్టర్ వరుణ్ (డీఎం కార్డియాలజీ), డాక్టర్ ఎస్.అపర్ణ రెడ్డి (డీఎం రుమటాలజీ), డాక్టర్ ఏ.సతీష్ (డీఎం గ్యాస్ట్రో ఎంట్రాలజీ), డాక్టర్ పివి హరీష్ (డీఎం కార్డియాలజీ), డాక్టర్ వనజాక్షమ్మ (డీఎం కార్డియాలజీ), డాక్టర్ రాజశేఖర్ (డీఎం న్యూరాలజీ), డాక్టర్ ఎం.రేవంత్ (డీఎం న్యూరాలజీ), వక్తలుగా తదితరులు పాల్గొన్నారు.

19నుంచి కుప్పంలో నారా భువనేశ్వరి పర్యటన

కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన ఖరారైంది. ఈనెల 19వతేది నుంచి 22వరకు కుప్పంలో నారా భువనమ్మ పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా నాలుగు మండలాల్లో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాలు, ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున పేదలకు సాయం అందించడంతో పాటు కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఉచిత శిక్షణ పొందుతున్న డిఎస్సీ అభ్యర్థులతో మాట్లాడతారని సమాచారం. నాలుగు రోజుల పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారికం తెలియాల్సి ఉంది. గత అక్టోబర్ నెలలోనే నారా భువనమ్మ కుప్పం పర్యటన ఖరారు కాగా అప్పట్లో తుఫాను ప్రభావంతో పర్యటన రద్దయింది. కాగా జనవరి నెలలో సిఎం చంద్రబాబునాయుడు సైతం కుప్పంలో పర్యటించనున్నట్లు సమాచారం.

ఘనంగా ఆత్మార్పణ దినం

– చిత్రపటానికి నివాళులు అర్పించిన ట్రైనీ కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్ర ఆవరణకు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబర్ 15న ఆత్మార్పణ దినంగా ప్రభుత్వం ప్రకటించడంతో కలెక్టరేట్‌లో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌లు కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసీ సంక్షమశాఖ అధికారి రబ్బానీ భాషా, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఫౌండర్‌కు నివాళులు

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: చిత్తూరు ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపకులు పి.రఘునాథరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి జిల్లా ఎపియుడబ్ల్యుజె అధ్యక్షులు లోకనాథం, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్‌బాబు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు ప్రెస్‌క్లబ్‌కు శాశ్వత భవనం ఏర్పాటు చేయడానికి, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి పి.రఘునాథరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాత్రికేయులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: తెలుగు ప్రజల ఆత్మగౌరవంను ప్రపంచానికి చాటి చెప్పి అమరణ నివారహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరుడయ్యారని వైకాపా నాయకులు పేర్కొన్నారు. వైకాపా కార్యాలయంలో ఆదివారం ఆత్మార్పణ దినం పురస్కరించుకుని వైకాపా నాయకులు, వాసవిక్లబ్ సభ్యులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు గోవర్ధన్, కోశాధికారి శ్రీధర్, సభ్యులు జయచంద్రగుప్తా, శరవణ, కృష్ణమూర్తిలు, వైకాపా నాయకులు కెపి శ్రీధర్, రాసనపల్లి ప్రకాష్, కుమార్, నారాయణమూర్తి, ముజీబ్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో ఆంధ్రరాష్ట్ర : మేయర్

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: 58 రోజుల పాటు అమరణ నిరాహార దీక్షతో ప్రాణత్యాగం చేసి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు చేశారని తెలుగు ప్రజలందరు పొట్టి శ్రీరాములును గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని మేయర్ అముద అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం ఆత్మార్పణ దినం పురస్కరించుకుని ఆదివారం మేయర్ అముద, ఇన్‌ఛార్జీ కమీషనర్ వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్ తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఆర్ఓలు గోపాలకృష్ణవర్మ, ఉమామహేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

అనర్హురాలికి చౌకదుకాణ డీలర్‌షిప్

పాలసముద్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తుళ్ళు అధికమయ్యాయి. అధికార పార్టీ నేతలు ఏమి చెప్పినా అదే చేయాల్సిన పరిస్థితి అధికారులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాలసముద్రంలో రేషన్ డీలర్‌షిప్ పొందడానికి అనర్హురాలైన ఒక మహిళలకు అధికార పార్టీ నేతలు వత్తాసు పలకడంతో తహసిల్దారు తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఆరు నెలల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాలసముద్రం మండలంలో రాజకీయం మారింది. అప్పటి వరకు వున్న రేషన్ డీలర్లు కొంతమందిని తొలగించి వాటి స్థానంలో తాత్కాలికంగా కొత్తవారిని ఎంపిక చేయడం జరిగింది. ఈ క్రమంలో పాలసముద్రం గ్రామంలోని 7వ షాపు రేషన్ డీలర్‌షిప్ ఖాళీ కావడంతో ఈ స్థానంను నిబంధనల ప్రకారం స్వయం సహాయక సంఘ సభ్యులను నియమించి వారి ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాల్సి వుంది. అయితే అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు నిబంధనలకు విరుద్ధంగా పెన్షన్ పొందుతున్న ఓ మహిళకు రేషన్ షాపు తాత్కాలిక డీలర్ సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఈ రేషన్‌షాపు తాత్కాలిక డీలర్‌షిప్‌ను అర్హత వున్న వారికి తాత్కాలికంగా కేటాయించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గణనాధుని సేవలో పలువురు ప్రముఖులు

కాణిపాకం,డిసెంబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వి.రవీంద్రన్, ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధరి చరణ్ సింగ్‌లు వేర్వేరుగా కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు,చిట్టిబాబు, స్థానిక ఎస్సై ధరణీధర, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కె.పట్నం వద్ద వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

తవణంపల్లె, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఈనెల 6న ఇంటి నుండి అదృశ్యమైన వృద్ధుడు గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై తేలడంతో ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనకు సంభందించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కె.పట్నంకు చెందిన సుబ్రమణ్యం(74) అనే వృద్ధుడు ఈనెల 6న ఇంటి నుండి అదృశ్య మయ్యాడు. దీనిపై ఆయన కుమారుడు నందకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదేరోజు తవణంపల్లె పోలీసులు మిసింగ్ కేసు నమోదు చేశారు. ఈనేపథ్యంలో అదృశ్యమైన సుబ్రమణ్యం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై తేలుతుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీనితో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టి శ్రీరాములు రుణం తీర్చుకోలేనిది

– ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు రుణం తీర్చుకో లేనిదని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం అమరజీవి వర్ధంతి సందర్భంగా కుప్పం తెదేపా కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో, స్థానిక అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, వేలు, ఎంఆర్ సురేష్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు శివదేవర్, జనసేన నరేష్, బిజెపి శివశంకర్, ఉమాపతి, వాటర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కాలనీలో పోలీసులచే కార్డెన్ సెర్చ్

కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీలో ఆదివారం వేకువజామున కుప్పం డిఎస్పీ పార్థసారథి నేతృత్వంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైల బృందం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో నివాసం ఉంటున్న వారి వివరాలు, ఆధార్ కార్డుల్లో ఉన్న వివరాలు పరిశీలించారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎస్సైలు శ్రీనివాసులు, నరేష్, వెంకట మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు టన్నుల తమిళబియ్యం సీజ్

కుప్పం,డిసెంబర్ 15 ప్రభాతవార్త : తమిళనాడులో పేదలకు అక్కడి ప్రభుత్వం ఇచ్చే చౌక బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుండగా టెంపోతో సహా పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం బరుగూరు నుంచి కర్ణాటకలోని బంగారుపేటకు సుమారు 5.50 టన్నుల బియ్యంను టెంపోలో తరలిస్తుండగా పోలీసులు స్థానిక మోడల్ కాలనీ వద్ద పట్టుకున్నారు. బియ్యం, టెంపోలను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 42మంది ఎంపిక

కుప్పంరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిచే కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 42మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో కంటి చికిత్సలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, వైద్య సిబ్బంది శివకుమార్, ఆశ, లావణ్య, నేత్రావతి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలించిన తెదేపా నేతలు

రామకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలోని ముద్దనపల్లి ప్రభుత్వ పాఠశాలలో గతంలో చేపట్టిన నాడు-నేడు పనులను ఆదివారం మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు పరిశీలించారు. ఇక్కడ చేపట్టిన పనులపై అధికారులచే విచారణ చేయించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు మునిరెడ్డి, కామరాజునాయక్, రఘు, గంగాధర్, నాగరాజు, మురళి, నవీన్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరంకు విశేష స్పందన

రామకుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పిఇఎస్ ఆస్పత్రి వారిచే స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. యాభై మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు పదిమందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు.వైద్యులు సంజనారెడ్డి, అనుపమ, శరణ్య, పిఆర్ఎ వెంకటేష్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం

శాంతిపురం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలో నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నలుగురు ఛైర్మన్లుగా తెదేపా నేతలను ఎన్నుకున్నారు. గిరివాసయ్య చెరువు సాగునీటి సంఘం ఛైర్మన్‌గా బోయనపల్లి ఆనందనాయుడు, సోగడబళ్ల పెద్ద చెరువు ఛైర్మన్‌గా సుశీలమ్మ, రాళ్లబూదుగూరు చెరువు సాగునీటి సంఘ ఛైర్మన్‌గా శివకుమార్, కొలమడుగు పెద్ద చెరువు ఛైర్మన్‌గా శేషాద్రిని ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాలను ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం అభినందించారు. ఎస్సై నరేష్ బందోబస్తు నిర్వహించగా తహశీల్దార్ శివయ్య ఎన్నికల సరళని పరిశీలించారు.కార్యక్రమాల్లో నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, ఉయ్యాలజయరాంరెడ్డి, రమేష్, శివశంకర్ నాయుడు, మణి, గోపాల్, బసవరాజు పాల్గొన్నారు.

జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడిగా కోదండరెడ్డి నియామకం

శాంతిపురం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడిగా శాంతిపురం మండలం చౌడంపల్లికి చెందిన కోదండరెడ్డిని నియమిస్తూ ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి ఆదేశాలతో ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పాత పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లాలోనిప్రజలుతమసమస్యలను పోలీసు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చును.

అర్ధగిరిలో వైభవంగా దత్త పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం దత్తపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

తెలంగాణా ఎమ్మెల్యేపై పోలీసులకు వెలమ సంఘం నేతల ఫిర్యాదు

పెద్దపంజాణి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్రం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై వెలమ సంఘనేతలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ వెలమ కులాన్ని తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు వెలమ నా కొడకుల్లారా అంటూ పత్రికల్లో రాయలేని విధంగా విమర్శించారన్నారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తమ సామాజిక వర్గాన్ని దూషించిన ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై తగు చర్యలు తీసుకోవాలని అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెలమ సంఘ నేతలు రామకృష్ణ, ధనంజయ, రామూర్తి, నందగోపాల్, నాగరాజు, సుబ్రమణ్యం, గోపాల్, బుజ్జిబాబు పాల్గొన్నారు. అంతకుముందు ర్యాలీనిర్వహించారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

సోమల, డిసెంబర్ 15 ప్రభాతవార్త : హిందూ పరిరక్షణ కోసం జనవరి 5వ తేదీ విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని పుంగనూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గన్న మదన్‌మోహన్ బాబు పిలుపునిచ్చారు. సోమల ఆంజనేయ దేవాలయం వద్ద హిందూ సమ్మేళనం సమావేశం ఆదివారం ఉదయం నిర్వహించారు. వందలాది మంది పాల్గొన్న ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కడు పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి వచ్చిన హిందూ సోదరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి జనసేనలోకి భారీ చేరికలు

పుంగనూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలం నల్లగుట్ల పల్లి పంచాయతీ నల్లగుట్ల పల్లి తాండాలో వైసీపీ పార్టీ నుంచి దాదాపుగా 100 కుటుంబాలు పైగా నియోజకవర్గ జనసేన నాయకులు వేణు గోపాల్ రెడ్డి సమక్షంలో జనసేన పార్టీ లో చేరాయి. వైసీపి కు చెందిన మాజీ సర్పంచ్ దేశా నాయక్, గ్రామ పెద్దలు రాజూ నాయక్, నాగరాజ నాయక్, మునిరాజ నాయక్ వారందరి అనుచరులు ఆదివారం వేణు గోపాల్‌రెడ్డి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీని పుంగనూరు నియోజకవర్గంలో బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, విరూపాక్ష, చిన్నా రాయల్, నరేంద్రరెడ్డి, పగడాల రమణ,చైతన్య రాయల్, హరి నాయక్, బాలాజీ నాయక్,నాయుడు, సుబ్బు, జయపాల్ రెడ్డి, వెంకట రమణరెడ్డి, శంకం రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రేవంత్, వెంకట రెడ్డి, సలీం భాష, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం

పుంగనూరు రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : పట్టణంలో స్థానిక కొత్తఇండ్లు సాయిబాబా గుడి ఆలయంలో వెలసి ఉన్న సత్యనారాయణ స్వామికి పౌర్ణమి సందర్భంగా సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చన, అలంకారం నిర్వహించే సత్య నారాయణ స్వామిని కథను భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు.

శబరిమలైకు పాదయాత్ర

పుంగనూరు రూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : పట్టణం నుంచి 15మంది అయ్యప్ప స్వామి భక్తులు ఆదివారం శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. మొదట స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఇరుముడులు కట్టుకున్నారు. తర్వాత గురుస్వామి రాము ఆధ్వర్యంలో 15 మంది స్వాములు కాలినడకన బయలుదేరారు. జనవరి 4వ తేదికి శబరిమలై చేరుకుంటామని ఆయన తెలిపారు.

పొట్టిశ్రీరాములకు ఘన నివాళుర్పించిన ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త: చిత్తూరు పట్టణం, గంగినేని చెరువు వద్ద నున్న అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు విగ్రహానికి వర్ధంతిని పురస్కరించుకొని చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పూలమాల వేసి ఘననివాలర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవరణకు అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమిన అలరించిన చండీహోమం

బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 15 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండపై పౌర్ణమిని పురష్కరించుకొని నిర్వహించిన చండీ హోమం భక్తులను అలరించింది. ఉదయాన్నే వేదపండితుడు గోవర్ధ శర్మ ఆధ్వర్యంలో వేద మండపంలోని అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద చండీహోమం గావించారు. ఇఓ ఏకాంబరం, అర్చక, అధికార, సిబ్బంది సేవలందించారు.

ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

కుప్పం,డిసెంబర్ 15 ప్రభాతవార్త: ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డా॥ అంబేద్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. విశ్రాంత హెచ్ఎం పిజి సెల్వం మాట్లాడుతూ గుంటూరులో జరిగే హాలోమాల ఛలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కొందరి స్వార్థం కోసం ఎస్సీలను కులాల ప్రాతిపదికన వర్గీకరించాలని చూడడం దారుణమన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలాజీ, జిసి వెంకటేష్, నారాయణస్వామి, సురేంద్ర, తులసిదాస్, రిటైర్డ్ హెచ్ఎం వెంకటేష్, మాలమహానాడు నేతలు మురుగేష్, గణేష్, నాగార్జున, మునిరత్నం పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

మడిబాక సాగునీటి సంఘ ఎన్నికలు

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలోని మడిబాక కీలకమైన సాగునీటి సంఘ ఎన్నికలు ఉత్కంఠంగా సాగాయి. రైతులు సమావేశం అయి సుదీర్ఘ చర్చల అనంతరం ఎన్నిక ఏకగ్రీవం చేసుకున్నారు. అందరూ ఏకాభిప్రాయంతో రాయపనేని సుధాకర్‌ను ఎన్నుకున్నారు. సుధాకర్ తనపై ఎంతో నమ్మకంతో గెలిపించారని రైతులకు సాగునీటి కోసం తప్పక ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు.

ఆర్యవైశ్యం సంఘంచే పొట్టి శ్రీరాములు వర్ధంతి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఆర్యవైశ్య సంఘం చే శ్రీవాసవి కన్యకారపరమేశ్వరి దేవ స్థానం సారధ్యంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకల ను మాజీ శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి సారధ్యంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు జరిపారు. కాగా పౌర్ణమి సందర్భంగా శ్రీవాసవి కన్యకార పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిపారు.అన్నదానం జరిపారు. అన్నదాన కార్యక్రమాలను పేర్ల రమేష్‌బాబు సారధ్యంలో నిర్వహించారు.ఈ నెల ఉభయదాతలుగా బుచ్చు ఆనందరావు,జూలుగంటి భరత్‌లుపర్యవేక్షించారు.

శ్రీకాళహస్తి సమస్యలపై స్పందించండి: జనసేన

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త : రాష్ట్ర మానవ వనరులు,ఐటిశాఖ మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను ఆదివారం జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట, కోట చంద్రబాబులు తమ సహోచరులతో కలసి పుష్పగుచ్చం అందించారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో భేటి అయ్యారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితిని వివరించారు. గ్రామాల్లో సమస్యలపై ప్రజలకు ఇచ్చిన హామీల గురించి నారాలోకేష్‌కు వివరించారు. సమన్వయంతో పని చేయాల్సిన తరుణమని వివరించినట్లు తెలిసింది.

ఘనంగా దత్తజయంతి వేడుకలు-అన్నదానం

తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలోని పెద్దకన్నలి పంచాయతీ కొత్తకన్నలి గ్రామంలో కాకిహరిబాబు, అనూషల ఆధ్వర్యంలో దత్తజయంతిని పురస్కరించుకుని దత్తాత్రేయ స్వామి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సద్గురు దత్తానంద్ మహారాజ్ మార్గనిర్దేశంతో దత్తస్వామి పాదుకలకు అభిషేకాలు పూజలు నిర్వహించారు. కార్యక్రమాలో కాకిచిన్న అంకయ్య, గుణపతి, వినోద్‌కుమార్, కన్నలివెంకటకృష్ణ, గంధంశ్రీనివా

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ నివాళులు

తిరుపతి విద్య డిసెంబర్ 15 ప్రభాతవార్త: అమరజీవి పొట్టి శ్రీరాములు భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులు, అమరజీవి అని, వారి సేవలు చిరస్మరణీయం , భావితరాలకు ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.ఆదివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, సహాయ బిసి సంక్షేమ అధికారిణి జ్యోత్స్న, సంబంధిత బిసి సంక్షేమ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయంలో తాళిబొట్టు చోరీ

సోమల, డిసెంబర్ 15, ప్రభాతవార్త : సోమల బస్టాండుకు కూత వేటు దూరంలో ఉన్న బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారి తాళిబొట్టు చోరీకి గురికావడం చర్చినియాంశమైంది. ఆలయ పూజారి ఉదయం 6 గంటలకు గుడి వద్దకు వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించాడు. హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదును తస్కరించారు. అలాగే అమ్మవారి మెడలో ఉన్న మూడు తాళిబొట్టు బిల్లలు భక్తులు సమర్పించిన వెండి బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం కార్యనిర్వహకులకు తెలియడంతో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర ఐ డి సి మాజీ డైరెక్టర్ సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలయంలో సీసీ కెమెరాలు అమర్చినందువల్ల దొంగలను గుర్తించే అవకాశం ఉంది. గుడిలో అమ్మవారి ఆభరణాలు తస్కరించే సమయంలో కందిరీగలు దొంగలపై దాడి చేయడంతో కొద్దిపాటి నగదు అక్కడే వదిలేసి దొంగలు పరారయ్యారు. సోమల్లో గంజాయి వాడకం. మద్యం మత్తుకు యువత బానిస కావడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని భక్తులు భావిస్తున్నారు. పోలీసుల విచారణలో వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

పడితే అంతే సంగతులు

సత్యవేడు, డిసెంబరు 15 ప్రభాతవార్త: సత్యవేడు నుంచి ఊత్తుకోట వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా దుస్థితికి చేరింది. రెండేళ్లుగా ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు లేకపోవడం మళ్లీ వరదల వల్ల రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడబడితే అక్కడ గోతులు, పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ఉంది. ఈ కారణంగా తరచూ ద్విచక్రవాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా వెంకటరాజుల కండ్రిగ, మదనంబేడు, సిరునంబుదూరు, బూదూర్ క్రాస్, పేరడం, సీతారాంపేట మలుపు, ఆంబాకం ప్రాంతాల్లో రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల ప్రమాదాలను ఆ ప్రాంతాలు ఆహ్వానిస్తున్నాయి. దీనికి తోడు వీఎంకే కల్యాణ మండపం ఎదురుగా రోడ్డు బాగా చిత్రమైపోయి ఉంది. ఇటీవల పోలీసులు అక్కడక్కడ గులకమన్ను చల్లి వదిలేశారు. దాంతో ముందు వెనుక వచ్చే వాహనాతో దుమ్ముదూళిలేసివామన చోదకులపై పడుతున్నాయి. ఈ కారణంగా ప్రమాదాలు నిత్య కృత్యమైపోయింది

కేంద్ర మంత్రి, కేంద్ర మంత్రిని కలసిన జాతీయ చేనేత దేవాంగ నాయకులు

వరదయ్యపాలెం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం రాష్ట్ర మంత్రి ఎస్ సవిత, టీటీడీ బోర్డు మెంబెర్ భాను ప్రకాష్ రెడ్డిలతో కలసి కేంద్ర చేనేత శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సాదర స్వాగతం పలికారు. మన్నెముద్దు శ్రీనివాసులుతో కలసి గుత్తి త్యాగరాజు కేంద్ర మంత్రిని ఘనంగా సత్కరించి, చరఖాను జ్ఞాపికను అందజేశారు. చేనేత జవుళీ శాఖ ఆర్డిడి గుత్తి రాజారావు, ఏడి వెంకట్రామ్,ఏడి రమేష్‌లు పాల్గొన్నారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నరసింహయాదవ్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రికి, జాతీయ దేవాంగ సమాఖ్య ఆధ్వర్యంలో గుత్తి త్యాగరాజు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. రామచంద్ర పురంలోని సిద్ధేశ్వరతీర్థ నందు గుత్తి త్యాగరాజు కేంద్ర మంత్రి గిరి రాజ్ సింగ్ ను కలసి కాసేపు చర్చించారు. భారత దేశంలో వ్యవసాయం తరువాత అతి పెద్ద పరిశ్రమ అయిన చేనేతను ఎన్డిఏ ప్రభుత్వం ద్వారా చేపడుతున్న కార్యక్రమాల పట్ల చర్చించారు. పద్మావతి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు.

గోవర్ధనపురం కాజువల్‌పై గుంతలు పూడ్చివేత

వరదయ్యపాలెం, డిసెంబర్ 15, ప్రభాతవార్త మండలం లోని గోవర్ధనపురం వద్ద ఉన్న కాజ్వే ఇటువుల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నది. వాహనదారులు నడిచిపోయేవారు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఇది గమనించిన టిడిపి మండల అధ్యక్షుడు పి.యుగంధర్ రెడ్డి కాజ్వేపై గొంతులో ట్రాక్టర్ తో గులక మట్టి మెటల్ వేసి గుంతల్లో పూడిపించారు. జెసిబి సహాయంతో నీటుగా చదును చేపించారు. దాదాపు మూడు పరియాలు ఆయనే ప్రజల సౌకర్యార్థం ఆయన సొంత ఖర్చుతో కాజువేపై తాత్కాలిక పరిష్కార మార్గం చేస్తూ ఉన్నారు. సురేష్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో, హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందు లేకుండా దగ్గరుండి తాత్కాలిక సమస్యను పరిష్కరించారు. ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పెన్షన్ హక్కు దయాదాక్షిణ్యలతో రాదు

– 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం

– ఆఫీసర్స్ క్లబ్లో గవర్నమెంట్ సీనియర్ పెన్షనర్లకు సన్మానం

తిరుపతి హెల్త్, డిసెంబర్ 15 ప్రభాతవార్త : పెన్షనర్స్ వారి జీవితం మొత్తం గవర్నమెంట్ సేవకు ధార పోసిన తరువాత వయసు మళ్లీ వృద్ధాప్యంలో ఇచ్చే పెన్షన్ ఎవరి బిక్ష కాదని, అది పెన్షనర్ల హక్కని ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్కొండరెడ్డి వెల్లడించారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆదివారం మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కమిటీ నిర్వాకులు ఆర్డి సుబ్రమణ్యం, ఆర్. శ్రీనివాసులురెడ్డి, లక్ష్మిరెడ్డి, ఎల్. వెంకట రమణారెడ్డి, టీఎన్. శ్రీధర్ తదితరులతో కలిసి మార్కొండరెడ్డి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ మంగళవారం స్థానిక నరసింహ తీర్థం రోడ్డు, ఎల్ఐసి బిల్డింగ్, ఇండియన్ గ్యాస్ గోడౌన్ పక్కన ఉన్న ఆఫీసర్స్ క్లబ్ నందు భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పెన్షనర్స్ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రమంత్రి గిరిరాజ సింగ్‌కు ఘన స్వాగతం

రేణిగుంట డిసెంబర్15ప్రభాతవార్త : కేంద్ర చేనేత శాఖామంత్రి గిరిరాజ సింగ్ కు రేణిగుంట విమానాశ్ర యంలో ఆదివారం ఉదయం ఘన స్వాగతం లభిం చింది. రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయ నకు విమానాశ్రయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, వివిధ ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

మాజీ ఎంఎల్ఏ, అతని అనుచరులపై కేసు నమోదు!

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆతని అనుచరులపై శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సిఐ డి.గోపి ఆదివారం తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం లోని స్వర్ణముఖి తీరాన బఫర్ జోన్‌లో నిర్మించిన రివర్‌వ్యూ రెసార్ట్ తొలగింపుకు వెళ్ళిన అధికారులపై మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వ్యవహరించిన తీరుతో కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాధ్యత కల్గిన మాజీ శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి, తన అనుచరులను పోగు చేసి విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు,సిబ్బంది, ఓ మహిళా ఉద్యోగినిని దూషించటం, వారి విధులకు ఆటంకం కల్గించినందుకు కేసు నమోదు చేసినట్లు సిఐ వివరించారు. ఉద్యోగులను దూషించటం విధి నిర్వహణకు ఆటంకం కల్గించటం, బెదిరించినందుకు కేసులతో పాటు సెక్షన్ 34 ప్రకారం కూడా కేసు నమోదు చేసినట్లు సిఐ డి.గోపి వివరించారు.

చామండేశ్వరి ఆలయంలో అన్నదానం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చామండేశ్వరి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. కమిటి చైర్మెన్ పులి రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు పలువురు దేవాంగసంఘ సభ్యులు సహకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. మార్గశిర పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరిపారు.

మైనారిటి ముస్లిం పరిరక్షణకే ఛలో కడప

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త : సమాజంలో మైనారిటి ముస్లింపై కేంద్ర ప్రభుత్వం రోజుకొక చట్టంతో భయభ్రాంతుల్ని చేస్తుందని ప్రస్తుతం మసీదులు, మదరాసాలు, వక్ఫ్, ఖాన్‌ఖాలకు సంబంధించిన ఆస్తులపై పెత్తనానికి కేంద్ర ప్రభుత్వం ప్రమాదకర చట్టాన్ని తీసుకువస్తుందని ఆదివారం చలో కడప కార్యక్రమాలను ప్రారంభించిన మత గురువులు వివరించారు. జమియతుల ఉలమ సారధ్యంలో కడపలో ఏర్పాటు చేసిన చైతన్య బహిరంగ సభకు శ్రీకాళహస్తి నుంచి భారీ ఎత్తున ముస్లింలు ప్రత్యేక బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఆదివారం ఉదయం బయలు దేరారు. మత గురువులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని నాయకులు మైనారిటిలపై పెత్తనానికి దాడి చేస్తున్నారన్నారు. షరియత్‌కు వ్యతిరేకమైన చట్టాలతో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. నేడు తీసుకొస్తున్న కొత్త చట్టంతో మసీదులు, మదరసాలు, వక్ఫ్ ఆస్తులు అన్ని జిల్లా కలెక్టర్ పరిధిలోకి వస్తాయి. ఒక చోట ముఫ్తీ నయిం సాహెబ్ మరో చోట హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్,హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ అలి సాహెబ్ మౌలానా మహబూబ్‌బాసాలు ప్రార్థనలు జరిపారు. తెలుగుదేశం నాయకులు మాజీ టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా మాజీ కౌన్సిలర్ బషీర్ అహ్మద్, షాకిర్‌అలి, ఖలీల్, వైకాపా నాయకుడు సిరాజ్‌బాషా హాజరై జెండాలు ఊపి ప్రారంభించారు.

నీటి సంఘంను టీడీపీ నేత ఏకగ్రీవం

కేవీబీ పురం, డిసెంబరు 15 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం తిమ్మ సముద్రం గ్రామంలో ఉన్న చెరువులకు సంబంధించి నీటి సంఘంను టీడీపీ సీనియర్ నేత సర్పంచ్ దొరబాబునాయుడు నేతృత్వంలో టీడీపీ ప్యానెల్ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. టీడీపీ పార్టీకి కష్టపడి పని చేసిన వారికే అవకాశం దక్కిందని, నీటి సంఘం అధ్యక్షుడిగా శివయ్యనాయుడు, ఉపాధ్యక్షుడిగా శివారెడ్డి, సభ్యులుగా వెంకటేష్‌నాయుడు,వీరారెడ్డి, డేగా సుబ్రహ్మణ్యం, మస్తానమ్మ, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబు, మంత్రి లోకేష్, సత్యప్రసాద్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసయాదవ్‌కి,జిల్లాపార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్రబీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, టీడీపీ నేత సర్పంచ్ దొరబాబునాయుడుకి నీటి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయమ్మలకు పెండింగ్ జీతాలు చెల్లించాలి : ఏఐటీయూసీ

నగరి, డిసెంబరు 15 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయమ్మలకు, వాచ్‌మెన్‌లకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, స్కూల్ ఆయమ్మల జిల్లా కార్యదర్శి జయకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల ఆయమ్మల వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) సంఘ విస్తృత స్థాయి సమావేశంలో ఈ మేరకు వారు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల స్కూల్ ఆయమ్మ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు గీత, కళ, సరస్వతి, తులసి, మంజుల, ఏఐటీయూసీ నాయకులు నాగభూషణం, మూర్తి, సదాశివం, సీత, యమునా, వేణి తదితరులు పాల్గొన్నారు.

మడిబాక ఆయకట్టు అధ్యక్షుడిగా సుధాకర్

రేణిగుంట డిసెంబర్15ప్రభాతవార్త మడిబాక ఆయకట్టు అధ్యక్షుడిగా రాయపనేని సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయకట్టు ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన వార్డు సభ్యులకు, పంచాయితీ రైతులకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రైతులందరితో భాగ్యస్వామ్యమై వారి అభివృద్ధికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

ఎరుకుల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి...

రేణిగుంట డిసెంబర్15ప్రభాతవార్త పేదరికంలో మగ్గిపోతున్న ఎరుకుల కులస్తులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దీనారి ప్రభాకర్ అన్నారు. రేణిగుంట శ్రీ గంగమ్మ ఆలయ ప్రాంగణము నందు ఆదివారం ఏకలవ్య ఎరుకుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో తిరుపతి మండలాల కార్యకర్తలతో సర్వసభ్య సమావేశం జరిగింది. తిరుపతి జిల్లాలో అనేక కులాల వారు ఎరుకుల కులస్తులుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది నిజమైన కులస్తులకు అన్యాయం చేస్తున్నారన్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఎరుకల కులస్తులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎరుకల కులస్తుల కులవృత్తి సోది చెప్పడం పూర్తిగా అంతరించిపోయిందన్నారు. వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ బ్రతుకు తెరువు కల్పించారన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి హరినాథ్, ఈశ్వరమ్మ, చీరాలయ్య, మునుస్వామి, వెంకటరమణ, యశ్వంత్, రాధిక, ప్రభాకర్, రామాంజనేయులు, ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భావితరం యువకులదే... కోలా ఆనంద్

రేణిగుంట డిసెంబర్15ప్రభాతవార్త : భారతదేశం భవిష్యత్తు యువకులపైనే ఆధారపడి ఉందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి యువ నాయకులు కోలా ఆనంద్ కుమార్ అన్నారు. రేణిగుంట పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం బాలాజీ స్టే ఇన్ రూమ్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యంగా అతిథిగా వచ్చిన కోలా ఆనంద్ కుమార్ ను బిజెపి, టిడిపి నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ చెప్పినట్లు భారతదేశ భవిష్యత్తు యువకులపై ఉందన్నారు. యువకులు దేశభక్తులుగా మారి దేశ సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నేత డి పుష్పనాదం, నవాబు, టిడిపి యువనేత ఎంజిరెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, సుబ్రమణ్యం రెడ్డి, రాజా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మీకోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఈ నెల 16వ తేది సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు, ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ఆదివారం తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కమిషనర్ తెలిపారు.

జిల్లా వడ్డెర సంఘం నూతన కమిటి ఎన్నికలు

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు దేవల మురళి, రాయలసీమ అధ్యక్షులు దేవల శ్రీనివాసులు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా వడ్డెర సంఘం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో ఆందరి అభిప్రాయంతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం వడ్డెరలకు పెద్దపీట వేసిందన్నారు. కులవృత్తులు, చేతివృత్తులకు ఆధారపడి పని చేసే వారికి రాష్ట్రవ్యాప్తంగా యంత్రాలు, పనిముట్లు కొనుక్కోవడానికి 8870 కోట్లు కేంద్ర రాష్ట్ర గవర్నమెంట్ ప్రవేశపెట్టింది. అందువల్ల మన వడ్డెర కులస్తులకు, కుల వృత్తులతో పనిచేసే జీవనం సాగిస్తున్నారు. వడ్డెర ఓబన్న జయంతిని జనవరి 11న ప్రభుత్వం నిర్వహించాలని వడ్డెర కులస్తులందరూ కోరారు.అనంతరం గౌరవ అధ్యక్షులుగా బత్తల ఆదినారాయణ, జిల్లా అధ్యక్షులుగా గుంజు మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షులుగా టి శ్రీనివాసులు, వేముల నాగరాజు, కోటకొండ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవల రమణ, జిల్లా కోశాధికారిగా బండి సుబ్రహ్మణ్యం, జిల్లా అధికార ప్రతినిధిగా బత్తుల రవి, చల్లా రమణ, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శిగా బత్తల వాసు, వేముల బాల, సోంపల్లి ద్రాక్ష యణి, జిల్లా కార్యదర్శులు, బండి మునిశంకర, సోంపల్లి జ్ఞానేంద్రి, వేముల బాబు, చంద్రగిరి జ్యోతిబాబు, పల్లపు మహేంద్రలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యక్షులు సింగపూర్ రవి , నాయకులు వేముల జగన్నాథం, వేముల నాగరాజు న్యాయవాది, వైసి హరిబాబు, దేవల కుప్పయ్య, దేవల సాంబశివ మరియు 200 మంది కుల బంధువులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ని సత్యవేడులో ఏర్పాటు చేయాలి

సత్యవేడు, డిసెంబరు 15 ప్రభాతవార్త: గతంలో లాగానే నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఉన్న ఈ స్టేషన్‌ని నాగలాపురం తరలించి సంబంధిత శాఖ అధికారులు తప్పటడుగులు వేయడం జరిగిందన్నారు. బెల్టుషాపులు, ఇతర అక్రమ కార్యకలాపాలపై ఫిర్యాదులు చేయాలన్న దిక్కులేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి తోడు తాజాగా ప్రైవేటు మద్యం షాపులు ఈ నెల 12 నుంచి తెలుసుకోనుంది. సర్కిల్ పరిధి కింద గతంలో లాగానే సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు, వరదయ్యపాళెం మండలాన్ని తీసుకొచ్చి ఇక్కడే సంబంధిత ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రైవేటు మద్యం షాపులు రానుండడంతో అదే వేగంతో ప్రతి పల్లెలోను బెల్టుషాపులు వచ్చే అవకాశం లేకపోలేదు. కొంత కల్తీ జరిగే ప్రమాదం ఉంది. అన్ని కోణాల్లో ఆలోచించి అధికారులు సత్యవేడులోనే ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి

తిరుపతి విద్య. డిసెంబర్ 15 ప్రభాతవార్త : స్థానిక గంధంనేనీ ఫంక్షన్ హాల్ ,బైరాగి పట్టెడ,నందు బాలాజీ నర్సింగ్ కాలేజీ,వినాయక నర్సింగ్ స్కూల్,ప్రవీణ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీహీరో,డైరెక్టర్, వ్యక్తి వికాస ట్రైనర్ అయినటువంటి ప్రదీప్ కొండిపర్తి,ఎస్.రవీంద్రా రెడ్డి ,గౌరవ కార్యదర్శి ఎం ఈ ఎస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కె శంకరయ్య క్లాస్ వన్ కాంట్రాక్టర్, ఎం.గిరిజా మోహన్ ,సోషల్ యాక్టివిస్ట్ విచ్చేశారు.ప్రదీప్ వ్యక్తిత్వ వికాసం పై విద్యార్థి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ.ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, కరస్పాండెంట్ ఏలియమ్మ జాన్,ప్రిన్సిపల్స్ జెస్సి గ్రేస్, నవీన్ కుమార్,ఏ.గీత, డియర్ పింకీ,భార్గవి మోహన్ కృష్ణ,సునీల్ రెడ్డి, అఖిల్,హారిక తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసం పూజలు ఆరంభం

నారాయణవనం, డిసెంబర్ 15 ప్రభాతవార్త : మండలంలోని టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంతో పాటు అను బంధ ఆలయాలు చంపకవల్లి సమేత పరాశారేశ్వరుడు, ఆంజనేయుని ఆలయం, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, సముదాయం శక్తి వినాయక, మరగవదల్లి సమేత అగస్తీశ్వరుడు, అవనాక్షమ్మ ఆలయాల్లో 16వతేది సోమవారం నుంచి ధనుర్మాసం(పీడనెల) పూజలను నిర్వహించడం జరుగుతుందని టిటిడి ఆలయ అధికారులు తెలిపారు

తిరుపతి డివిజన్

పవర్ లిఫ్టింగ్ అండర్-19 జిల్లా జట్టు ఎంపిక

వడమాలపేట, డిసెంబరు 15 ప్రభాతవార్త: స్కూల్‌గేమ్స్ అండర్-19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు సెక్రటరీ జయరామయ్య తెలిపారు. వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. ఎంపికైన జట్టు ఎన్‌టీఆర్ జిల్లా కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిసెంబరు 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు కరుణ నవనీతం కోరారు. జిల్లా బాలికల జట్టులో వినీత, స్వీటీ కుమారి(వడమాలపేట), రాజేశ్వరి, లిఖిత, గ్రేసి, రోజా(రేణిగుంట), శైలజ(పుత్తూరు), జిల్లా బాలుర జట్టులో యశ్వంత్, సతీష్, దేవరాజులు, వరుణ్(వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల), జయసూర్య, ఉదయకుమార్, చరణ్‌కుమార్(వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల).

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

వడమాలపేట, డిసెంబరు 15 ప్రభాతవార్త: గ్రామాల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బంది పడకుండా మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం మండలంలోని టీసీ అగ్రహారంలో వాటర్ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన, రోడ్లు సౌకర్యం కల్పించడమే ధ్యేయంగా ఉమ్మడి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి రావు, టీడీపీ నాయకులు ధనంజయలునాయుడు, రవిరెడ్డి, దాము, ముదిరాజ్, వెంకటరమణ, కృష్ణా రెడ్డి, లక్ష్మిప్రసన్న, హేమావతి, పెద్దబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. అలా

పట్టణానికి నిండుతనం చేకూర్చనున్న చందన షాపింగ్ మాల్

- చందన షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన ప్రముఖ సినీనటి రీతూవర్మ - విద్యుద్దీపాలంకరణలు, రకరకాల నృత్యాలతో నూతన శోభ





సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో నూతనంగా చందన షాపింగ్ మాల్‌ను అట్టహాసంగా సినీతార రీతూవర్మ, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, ఇతర ప్రముఖుల చేతులు మీదుగా ఆదివారం ప్రారంభించారు. ప్రజల అభిమానాన్ని చూరగొనే విధంగా వస్త్ర ప్రపంచంతో పాటు స్వర్ణ భరణాలను కూడా విక్రయించే షాపింగ్ మాల్‌ను ప్రప్రథమంగా సూళ్లూరుపేటలో ప్రారంభించారు. దీంతో సూళ్లూరుపేట పట్టణానికి నూతన శోభ చేకూరింది. గత నెల రోజులుగా యుద్ధప్రాతిపదికన షాపింగ్‌మాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ఆదివారం నాటికి స్వర్ణ కాంతులు వెదజల్లే శోభాయమానంగా తీర్చిదిద్దారు. సూళ్లూరుపేట పట్టణంలో పెద్దఎత్తున షాపింగ్‌మాల్‌ను ప్రారంభించడంతో ప్రజలు షాపింగ్ మాల్‌కు తండోపతండాలుగా తరలివచ్చారు. ఒకవైపు మేళతాళాలు, కేరళ నృత్యాలు, సినీతారల సందడి, ప్రముఖ నటుల డూప్‌లచే ప్రదర్శనలతో ప్రజలను అలరించారు. ఉదయం నుంచే చందన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం వరకు ఈ వేడుకను తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణానికి నిండుతనం చేకూర్చేవిధంగా మంచి షాపింగ్ మాల్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. శుభకార్యాలకు చెన్నై, నెల్లూరు, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండానే సరసమైన ధరకు సూళ్లూరుపేటలోనే పట్టుచీరలతో పాటు బంగారు నగలు కూడా లభించడం మంచి పరిణామమని తెలిపారు. సినీనటి రీతూవర్మ మాట్లాడుతూ చందన షాపింగ్ మాల్ యాజమాన్యం అందించిన ఈ సదవకాశాన్ని సూళ్లూరుపేట ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిరథ మహారథులందరికీ చందన షాపింగ్‌మాల్ అధినేత మావూరు శ్రీనివాసులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మోపూరు పెంచలయ్య, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, వేమసాని శ్రీనివాసులు నాయుడు, చిట్టేటి పెరుమాళ్లు, మేడా సాయితో పాటు ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, పట్టణంలోని కౌన్సిలర్లు, ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

ఎమ్మెల్యేను ఆహ్వానించిన విశ్వహిందూ పరిషత్

గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త: గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌ని గూడూరు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు హైందవ శంఖారావం కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. జనవరి 5వ తేదీ 2025వ సంవత్సరం విజయవాడ గన్నవరం సమీపంలో జరిగే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు రావాలని ఆహ్వానించారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా హిందువులందరూ ఐక్యంగా ఒక భారీ బహిరంగ సభను నిర్వహించబో తున్నారు. దేశం స్వతంత్రాన్ని పొంది 77 సంవత్సరాలు పూర్తయిన హిందువులకు మాత్రం తమ దేవాలయాలు తాము నిర్వహించుకునే స్వతంత్రత ఇప్పటికీ రాలేదన్నారు. హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి రక్షణ, సమాజ సంరక్షణ కోసం జరుగుతున్న ఈ హైందవ శంఖారావానికి అందరూ మద్దతు పలకాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అందరూ శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కూడా ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మురళిరెడ్డి, రమణయ్య, ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రముఖ్ హరిబాబు, జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖ్ మల్లికార్జున, మనోహర్, శ్యాం సాయి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే గురజాల చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు

చిత్తూరురూరల్, డిసెంబరు 15 ప్రభాతవార్త: స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారనీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఉదయం దొడ్డిపల్లి శ్రీసప్తకన్నికలమ్మ ఆలయం వద్ద కార్తీకదీపం మహోత్సవంలో పాల్గొని అనంతరం సంతపేట ఆర్యవైశ్య భజన మందిర నిర్మాణానికిభూమి పూజ, 46వ వార్డులో నీటి సరఫరా బోరు, మోటర్లను స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. మంగసముద్రం వద్ద కాశీ విశ్వనాధుని స్మశానవాటిక నందు దిశదిన కర్మభవనం, చిత్తూరు రూరల్‌మండలం పెరుమాళ్ల కండ్రిగగ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్‌రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, నగరపాలక సంస్థ అధికారులు, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సిటీలో అరకు కాఫీ ఆన్ ది వీల్

శ్రీ సిటీ, డిసెంబర్ 15, ప్రభాతవార్త : వరదయ్యపాలెం మండలం శ్రీ సిటీలో మొబైల్ వ్యాన్ ద్వారా కంపెనీ దగ్గరికి వెళ్లి అరుకు కాఫీ సప్లై చేయబడును, మ్యాంగో గార్డెన్ వారిచే అరుకు కాఫీ అందుబాటులో తీసుకొచ్చారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి... తిరుమలేశుని ప్రసాదాలు

తిరుమల, డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో అదనపు ఈఓ కలిసి తిరుమల వెంకన్న తీర్థప్రసాదాలు అందజేశారు. హైదరాబాద్‌లోని వెంకన్న ఆలయం, సమాచార కేంద్రం వివరాలు చర్చించుకున్నారు. స్వామివారి ఆలయంలో విశేషాలు వివరించారు.

కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు నేతల స్వాగతం

తిరుపతి(రవాణ), డిసెంబర్ 15ప్రభాతవార్త: తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌కు ఆదివారం సాయంత్రం బిజెపి నాయకులు సాదర స్వాగతం పలికారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం వద్ద కేంద్రమంత్రిని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బిజెపి నేతలు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్ దుశ్శాలువతో సత్కరించారు.

స్వర్ణముఖి సాగునీటి ఆయకట్టు ఏకగ్రీవం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొన్ని చోట్ల నాయకుల మధ్య పట్టు చోటు చేసుకుంది. ఈ ఎన్నికలకు ప్రతిపక్ష వైకాపా నాయకులు దూరమయ్యారు. దాంతో దాదాపు అన్ని సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా తెలుగుదేశం మద్దతు దారులు సాగునీటి సంఘా ధ్యక్షులయ్యారు. అయితే మేజర్ ఆయకట్టుకు సంబంధించిన స్వర్ణముఖి సిస్టం సంఘానికి చివర వరకు ఉత్కంఠత చోటు చేసుకుంది. ఈ సీటుపై ఎలాగైనా తన మద్దతుదారుని కూర్చొబెట్టాలని చివరి వరకు తొట్టంబేడు మండల నాయకుడు, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి గాలి చలపతి నాయుడు ప్రయత్నించారు. తమ పార్టీలోనే పోటీ ఏర్పడింది. ఈ నీటి సంఘానికి గుర్రప్పనాయుడు కండ్రిగకు చెందిన రైతును కూర్చొబెట్టాలని భావించారు. అయితే ముందుగా శంకర్‌నాయుడు పేరును ఖరారు చేసుకున్నాము కదా? అని చలపతి నాయుడును ప్రశ్నించారు. ముందుగానే మీరు అనుకుంటున్న పేరును చర్చకు పెట్టి ఉంటే ఆయన్నే ఎన్నుకునే వారము కదా? అని చర్చించారు. దాంతో స్వర్ణముఖి సిస్టం తొట్టంబేడు యూనిట్ చైర్మెన్‌గా ఘట్టమనేని శంకర్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన్ను తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు.

అప్పలాయగుంటలో వైభవంగా దీపోత్సవం

వడమాలపేట, డిసెంబరు 15 ప్రభాతవార్త: మార్గశిం మాసం, కార్తీక పౌర్ణమి సందర్భంగా అప్పలాయ గుంట లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరుని విశేషంగా అలంకరించి ఆలయ ఆవరణలో వెంచేపు చేసి హారతులు ఇచ్చారు. పుణ్యవచనం, లక్ష్మిపూజ, విశేష నివేదన చేశారు. ఆకాశ దీపం వెలిగించారు. అర్చకులు దీపాలను మేళతాళాలతో ఊరేగింపుగా పుష్కరిణీ, ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు పాల్గొన్నారు.

కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం

కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆదివారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయమండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండి తుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

జే.వి.విచే కూరగాయలు, గుడ్లు పంపిణీ

గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యం లో సూర్యా ఫ్యాన్సీ అధినేత ఒగ్గు వేణుగోపాల్ దాతృత్వంలో స్థానిక సి.వి.సి పార్కు నందు దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణి చేసారు. అనంతరం జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేయడమే కాకుండా అనేక సేవా కార్యక్రమా లు చేస్తున్నామని గత 32 సంవత్సరాలుగా ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తున్నామని విద్యార్థిని, విద్యార్థులను శాస్త్రీయ దృక్పథం వైపు పయనించేలా చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, గుర్రం విజయ్‌బాబు, ఇబ్రహీం, మామడూరు రాధయ్య, ప్రభాకర్, సుమన్ రెడ్డి, ఆనంద్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి కుటుంబానికి ఆర్థిక సహాయం

చిల్లకూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త మండలంలోని కలవకొండ గ్రామం నందు పార్టీ కార్యకర్త బూదూరు శ్రీదేవి అకాల మరణం పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు. విషయం తెలుసుకున్న శ్రీదేవి కుటుంబానికి శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ 10 వేల రూపాయిలు ఆర్థిక సహాయంను అందిస్తున్న నాయకులు నెలటూరు చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల హక్కులను కాపాడు కుందాం

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా నిర్మాణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి.హెచ్ పి.ఎస్ జిల్లా అధ్యక్షులు నాగభూషణం అధ్యక్షత వహించారు. డి.హెచ్.పి. ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడు తూ దేశంలో దళితులకు రక్షణ కరువైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దారి మళ్లిస్తూ దళితుల అభివృద్ధిని అడ్డుకుంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి. ఎస్ జిల్లా అధ్యక్షులు నాగభూషణం, డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నగరాజన్, డి.హెచ్.పి.ఎస్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.బలరాం, డి.హెచ్.పి. ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాలయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజన్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు మస్థానయ్య, ఏ. ఐ.టి.యు.సి జిల్లా సహాయ కార్యదర్శి నాగేంద్ర, ఏ. ఐ.టి.యు.సి నియోజక వర్గ అధ్యక్ష, కార్యదర్శి లు ఎంబెటి చంద్రయ్య, నారాయణ, చిల్లకూరు సీపీఐ మండల కార్యదర్శి రమేష్, మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు రాఘవులు, సీపీఐ నాయకులు రఘు రామయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆర్చి నిర్మాణం ప్రారంభం : ఎమ్మెల్యే

వెంకటగిరి, డిసెంబర్ 15 ప్రభాతవార్త: గ్రామశక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారికి శిలా తోరణాన్ని నిర్మించాలని 15 సంవత్సరాల నాటికల నేటికి నెరవేరిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద 56 లక్షల రూపాయల సొంత నిధులతో నిర్మించే పోలేరమ్మ అమ్మవారి శిలా తోరణం పనులకు ఎమ్మెల్యే శాస్త్రవేత్తంగా భూమి పూజ చేశారు. పోలేరమ్మకు ఆర్చి నిర్మించాలని తాను 15 సంవత్సరాల క్రితమే అనుకున్నానని వాయిదా పడుతూ వచ్చిందని తెలిపారు. పోలేరమ్మ ఆర్చి నిర్మించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మార్చి నాటికి ఆర్చి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటరమణ, ఎస్సై సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కే వి కేప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల్లో ఎంతో అభివృద్ధి చేశాం

- టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుష్మారెడ్డి

కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో చేయలేని పనులను ఈ ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి అన్నారు. ఆదివారం తిన్నెలపూడిలోని తన స్వగృహంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. ముందుగా గూడూరు నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజేతలుగా నిలిచారని, ఇందుకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అభ్యర్థులను ఏకగ్రీవం చేసేందుకు వ్యూహరచన చేసి విజయవంతం అయ్యారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగతంగా చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కూడా నియోజకవర్గం ముందు వరుసలో ఉండటం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 73 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సేవ చేస్తూనే రాజకీయాల్లో కొనసాగుతున్నామని తెలిపారు. తమ కుటుంబం 30 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిందని ఆమె గుర్తు చేశారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో...కార్తీక దీపోత్సవం

చంద్రగిరి, డిసెంబర్ 15 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం కార్తీక దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయంలో అర్చకులు వేకువ జామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. కార్తీక పర్వదీపోత్సవాన్ని కార్తీక పౌర్ణమి రోజున సాయంత్రం కైంకర్యాలను ముగించిన పిదప కార్తీక దీపోత్సవం నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు కార్తీక దీపోత్సవ హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాథ్, సూపరింటెండెంట్ పి.మునిబాలకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్లు ధనశేఖర్, అర్చకులు నారాయణ శేషాచార్యులు, దివి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది గోపాల్ భట్టాచార్య సంతాన కృష్ణన్, డాక్టర్ లక్ష్మి రాజేష్, నాళ్ళూరి విష్ణుమూర్తి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్లలో జోష్

కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికవడంతో కోట మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకుల్లో జోష్ కనిపిస్తోంది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాలతో కోట మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, మధుసూదన్‌యాదవ్ ఈ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి 20 సాగునీటి సంఘాలకు గాను 19 స్థానాలను ఏకగ్రీవంగా తమ పార్టీ వారిని ఎన్నుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఈ సందర్భంగా టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ తెలిపారు.

అల్లంపాడులో పేర్నాటి సత్తా

కోట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : కోట మండలంలోని 20 సాగునీటి సంఘా లకు గాను 19 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యాయి. అల్లంపాడు గ్రామంలో మాత్రం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తన అనుచరుడు, మాజీ సర్పంచ్ పోచంరెడ్డి రాజారామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేశారు. అక్కడ రైతులు పట్టుబట్టి కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలని చేసిన ప్రయత్నాలను శ్యాంప్రసాద్‌రెడ్డి వర్గం గట్టిగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో రాజారామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పోరాడి అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కచ్చేరివీధిలోని ఆయన కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కాళంగి ప్రభాకర్, కె.సుబ్బారావు, వై.నాగేశ్వరరావు, అయితా శ్రీధర్, కె.శ్రీరామమూర్తి, పైడిమర్రి కిషోర్, ఓలేటి వెంకటేశ్వర్లు, బండారు ఆంజనేయులు, మద్దూరు భాస్కర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దుర్గి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వినయ్‌కు ఆర్థిక సహాయం

సూళ్లూరుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త : సూళ్లూరుపేటకు చెందిన ఆర్.వినయ్‌కుమార్ ఇటీవల రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయారు. దీంతో కృత్రిమ కాలు ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక చొరవతో ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రూ.46 వేలు వినయ్‌కుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఎజి కిషోర్, పార్థసారథి, రాయపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 3వ అడ్వెంటు వేడుకలు

గూడూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త : గూడూరులోని సెయింట్ పాల్ పీటర్స్ టూథరన్ చర్చ్‌లో ఆదివారం స్త్రీల క్యాండిల్ సర్వీసు ఘనంగా జరిగింది. జాయ్ అనే ప్రధాన అంశంపై స్త్రీలు వ్యాక్యం పాటలు ఆలపించి క్యాండిల్స్ వెలిగించారు. ఈ కార్యక్రమంలో సంఘకాపరి, సంఘ చైర్మన్, కార్యవర్గం, స్త్రీలు, పిల్లలు పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేశారు.

అమరజీవి శ్రీరాములు సేవలు మరువలేనివి

వెంకటగిరి, డిసెంబర్ 15 ప్రభాతవార్త : అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేమని గ్రంథాలయ సంస్థ అధికారి అల్లిశెట్టి అంజయ్య తెలిపారు. గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తెలుగు రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ గ్రంథాలయ అధికారిని లీలావతి, ఉపాధ్యాయుల రత్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ తెరిసా వృద్ధాశ్రమం ప్రారంభం

వెంకటగిరి, డిసెంబర్ 15, ప్రభాతవార్త : పట్టణంలోని రాణిపేటలో మదర్ థెరిస్సా వృద్ధాశ్రమాన్ని ఏపిపి ప్రకృతి కుమార్ సిఐ వెంకటరమణ ప్రారంభిం చారు. వృద్ధులకు సేవ చేసేందుకు ఆశ్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మార్పు సంస్థ అధ్యక్షులు పవన్ తెలిపారు. ఆశ్రమంలో వృద్ధులు చేరవచ్చు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుబ్బారావు, గోపి పాల్గొన్నారు.

వార్త

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

తిరుపతి నగరం, శ్రీసిటీ, చంద్రగిరి రూరల్, గుడూరు రూరల్ కేంద్రాల్లో పనిచేయుటకు.

మీ పూర్తి బయోడేటాతో : ఈ క్రింది చిరునామాను సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880